లేపింది సుజాత! రవీంద్రకు లేవక తప్పలేదు. నిదానంగా సుజాతను అనుసరిస్తూ గుడిలోకి అడుగుపెట్టాడు. అర్చన చేయించడానికి బుట్ట పూజారికి అందించింది సుజాత! బుట్ట అందుకోవడానికి ఇటు తిరిగిన పూజారి రవీంద్రను చూసి చిరునవ్వు నవ్వాడు. వెంటనే చిన్నగా రవీంద్ర కనుసైగ చేశాడు. భక్తిపారవశ్యంతో సుజాత కళ్ళు మూసుకొని దేవుణ్ణి ప్రార్థించసాగింది. వెంటనే రవీంద్ర ఇరవైనోటు ఒకటి పూజారిచేతి కందించి, కళ్ళు మూసుకున్నట్లు దేవుణ్ణి ప్రార్థిస్తున్నట్లు నటించ సాగాడు. హారతి కర్పూరం వెలిగించగానే అందులో చిల్లర డబ్బులు వేసి దేవునికి మొక్కి, కొబ్బరికాయ తీసుకొని సుజాత, రవీంద్ర ఇంటికి వెళ్ళిపోయారు. ఇంట్లోకి వెళ్ళగానే సుజాత మంచం మీద బోర్లాపడి ఏడ్వ సాగింది. ఏం జరిగింది సుజీ? ఎందుకేడుస్తున్నావు? అంటూ వీపు మీద చేత్తో తడ్తూ అడగసాగాడు. చేతిని విదల్చికొట్టింది సుజాత. ఎంత మందితో మీ సరసాలు సాగిస్తున్నారు. అది చెప్పకుండా ఉండడానికి పూజారిగారికి ఎన్నిసార్లు ఇలా డబ్బులు ఇచ్చారు? చెప్పండి అంటూ ఏడుస్తూ రవీంద్ర నుండి దూరం జరిగింది. అది కాదు సుజీ  నీవు పొరపడుతున్నావు. పూజారి ఎవరనుకొంటున్నావు. నా బాల్యస్నేహితుడు రఘురాం. మొన్న మార్కెట్‌కు కూరగాయలకు వెళ్ళినప్పుడు డబ్బులు తీసుకెళ్ళడం మరచిపోయాను. అటు నుండి వస్తున్న రాఘవ దగ్గర ఇరవైరూపాయలు తీసుకున్నాను. దాని తాలూకు డబ్బులు నిన్న గుళ్ళో ఇచ్చాను. నీవు వేరే విధంగా నన్ను అర్థం చేసుకొన్నావు. ఇదంతా ముందే నీకు చెప్పకపోవడం నా తప్పు. సారీ సుజీ! అంటూ సుజాత కళ్ళు తుడవసాగాడు రవీంద్ర. అది వింటున్న సుజాత ఆశ్చర్యంతో నోరు తెరచుకొని రవీంద్రనే చూడసాగింది.

పి. శ్రీనివాస్

## వక్రబుద్ధి

"లక్ష్మి!.... ఆహా ఏమి అందం! అందాన్నంతా అచ్చుదిమ్మెలో పోసి చేసాడా లక్ష్మిని ఆ బ్రహ్మ పేద కుటుంబంలో పుట్టినా మట్టిలో మాణిక్యం. లక్ష్మి అందాన్ని చూస్తే, ఎవరికైనా పిచ్చి పాకాన పడకమానదు. అటువంటి అందం తన ఇంటికి దగ్గరగా ఉండడం తన అదృష్టం" దీన్నంతా ఆలోచిస్తున్నది లక్ష్మి ఇంటికి పదడుగుల దూరంగా ఓ ఇంట్లో ఒంటరిగా ఉంటున్న ప్రశాంత్. ప్రశాంత్ కూడా తక్కువ అందం ఉన్నవాడు కాదు. మంచి అంగ సౌష్టవం, తెలివి అతని సొంతం.

ఇంతలో తలుపు చప్పుడైంది. ఎదురుగా ప్రమీల! "ప్రశాంత్! నీ కోసమే వచ్చాను! నువ్వు నన్ను కాలేజీలో చూడకపోయినా, నువ్వంటే నాకిష్టం. మా అమ్మా, నాన్నా కూడా నిన్ను చేసుకోడానికి ఒప్పుకున్నారు. నీ నిర్ణయం మీదే నా జీవితం ఆధారపడి ఉంటుంది. ఏమంటావ్?"

హఠాత్ పరిణామానికి నిర్ఘాంతపోయాడు ప్రశాంత్. ప్రమీల! కొన్ని లక్షలకి ఏకైక వారసురాలు! తన క్లాస్‌మేట్! అదృష్టం ఈ విధంగా తనను వరిస్తుందని కల్లోకూడా అనుకోలేదు. ఆమె భుజంపై చెయ్యేసి లోపలికి తీసుకు వెళ్ళాడు ప్రశాంత్. ఇప్పుడు అతనిలో పేదలక్ష్మి ప్రసక్తే లేదు. ధనలక్ష్మి ప్రసక్తి తప్ప!

ఎ. వెంకట వేణుగోపాల్

# అరచేతిలో వెంట్రుకలు

ఉద్యానవనంలో కూర్చున్న అక్బర్ ఏమీ తోచక తన అరచేతి వైపు చూసుకున్నాడు. వెంటనే పక్కనే వున్న భార్యవైపు తిరిగి "నాకొక సందేహమొచ్చింది. మన శరీరమంతా వెంట్రుకలు మొలుస్తాయి. కానీ అరచేతిలో మొలవవు. కారణమేంటి?" అని అడిగాడు.

"ఇదేం సందేహం?" విస్మయంగా చూసింది రాణి. "నాకు తెలీదు" అంది నెమ్మదిగా.

రాజు అంతటితో ఆగలేదు. కనిపించిన ప్రతివాడినీ అడిగాడు. అందర్నీ అడిగినా సందేహం తీరకపోవడంతో బీర్బల్‌ని పిలిపించాడు అక్బర్.

"నా అరచేతిలో వెంట్రుకలు లేకపోవడానికి కారణమేమిటో చెప్పగలరా?" అడిగాడు రాజు.

ఒక్క క్షణం ఆలోచించి చిరునవ్వు నవ్వాడు బీర్బల్.

"మహారాజా! మీరు నిత్యము వేలాది మందికి దానధర్మాలు చేస్తుంటారు కదా? ఆ రాపిడికి మీ అరచేతిలో వెంట్రుకలు రాలిపోయుంటాయి" వినయంగా చెప్పాడు.

"నా సంగతి సరే. మీక్కూడా అరచేతిలో వెంట్రుకలు లేవుగా" ప్రశ్నించాడు రాజు.

"మీరు ఇచ్చే కానుకలనన్నింటిని తీసుకొని రాలిపోయాయి ప్రభూ" మరింత వినయంగా చెప్పాడు బీర్బల్.

"అంతా బాగానే వుంది. కానీ మా నుండి ఎటువంటి బహుమతులు గ్రహించని వారి అరచేతుల్లో కూడా వెంట్రుకలు లేవు. మరి దాని సంగతేమిటి?" అడిగాడు రాజు.

"దానికేముంది ప్రభూ! మీ నుండి బహుమానాలు సంపాదించలేక, మేము పుచ్చుకుంటుంటే చూడలేక కోపంగా చేతులు నలుపుకుంటూ కోర్చోవడం వలన వాళ్ళ చేతుల్లో వెంట్రుకలు మొలవడం లేదు" తెలివిగా సమాధానమిచ్చాడు బీర్బల్.

ఈ సమాధానాలతో తృప్తి చెందిన రాజు బీర్బల్‌ని అభినందించి, ఘనంగా సన్మానించాడు.

— గొల్లపూడి శైలజ.

